గ్రామీణ విద్యార్థులకు ప్రామాణిక విద్యనందించడానికి దేశవ్యాప్తంగా ఏర్పాటైన పాఠశాలలు నవోదయ విద్యాలయాలు. సంస్కృతి, విలువలు, పర్యావరణ స్పృహ, సాహసోపేతమైన కార్యకలాపాల పట్ల అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (హెచ్‌ఆర్‌డి) ఈ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఒక విధంగా వీటిని మాజీ ప్రధాని పివి నరసింహారావు మేథో పుత్రికగా చెప్పొచ్చు. అప్పటి రాజీవ్ హయాంలో ఆయన కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా వీటి ఏర్పాటుకు తోడ్పడ్డారు. అప్పట్నించి ఇవి తమ ప్రత్యేకతను కాపాడుకుంటూ వస్తున్నాయి.

భారత ప్రభుత్వ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయాలు 1986 జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి ఏర్పాటయ్యాయి. నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో గురుకుల విద్యా విధానం ద్వారా కొనసాగే పాఠశాలలివి. తమిళనాడు మినహా దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఇవి ఉన్నాయి. ఒక్కో పాఠశాల ఆరో తరగతిలో 80 మందిని చేర్చుకోవచ్చు. స్థలం తదితర పరిమితుల దృష్ట్యా కొన్ని చోట్ల ఈ సంఖ్య 40గా ఉంటుంది. కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితులతో నిమిత్తం లేకుండా అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల్లో 75 శాతం గ్రామీణ ప్రాంతం వారై ఉండాలి. అలాగే 33 శాతం బాలికలకు నిర్దేశించారు.

### లక్ష్యాలు

చదువు, క్రమశిక్షణతోపాటు పలు అంశాల్లో సుశిక్షితులైన పౌరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఏర్పాటైన పాఠశాలలు ఇవి. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, విలువల గురించి గట్టి పునాదిని ఏర్పర్చడం, పర్యావరణ బాధ్యతల పట్ల అవగాహన కల్పించడం, సాహస కార్యక్రమాల్లో పాల్గొనేలా వారిని తీర్చిదిద్దడం వంటి అత్యుత్తమ ఆశయాలు నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. బాల బాలికల ప్రతిభా శక్తిని వికసింప జేయడం, ప్రతిభావంతులైన వారికి ఉన్నత విద్యాస్థాయి అవకాశాలు కల్పించి వారి సంపూర్ణ వికాసానికి సాయపడటం కూడా ఓ లక్ష్యం. ఈ విద్యాలయాలను జిల్లా స్థాయిలో ఉన్నతమైన ఆదర్శ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దుతూ సమీప పాఠశాలలను ప్రభావితం చేయడం, విద్యార్థుల విద్యాస్థాయిని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందింపజేయడం కూడా లక్ష్యాలే.

త్రిభాషా సూత్రం ప్రాతిపదికన మన




గుతున్నది. విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశం పొందే నాటికి చదువుతున్న బోధన మాధ్యమమైన ప్రాంతీయ లేదా మాతృ భాషలోనే 8వ తరగతి వరకు బోధన ఉంటుంది. ఆ తర వాత 9 నుంచి 12వ తరగతి వరకు బోధన ఆంగ్ల, హిందీ భాషల్లో కొనసాగుతుంది. ఈ తరగతుల్లో గణితం, సైన్స్, కామర్స్ సబ్జెక్టులు ఆంగ్ల మాధ్యమంలోనూ, సామాజిక శాస్త్రాలు హిందీ మాధ్యమంలోనూ బోధిస్తారు.

బాల బాలికలకు వేర్వేరు హాస్టల్ వసతి కల్పిస్తారు. క్రీడలు, యోగా, సాంస్కృతిక అంశాల్లో శిక్షణ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక తరగతి విధానానికి అవసరమైన ఇంటర్నెట్, వి-శాట్, ఎడ్యుశాట్ వంటి అధునాతన సాంకేతిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నారు.

పాఠశాలలో చేరిన తరవాత 6 నుంచి 12వ తరగతి విద్యాభ్యాసం వరకు వరకు విద్యార్థులకు వసతి, భోజనంతో పాటు పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫార్మ్ మొదలైనవి ఉచితంగా అందిస్తారు.

దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న జనరల్ కేటగిరీకి చెందిన బాలురు 9వ తరగతి నుంచి 12వ తరగతి విద్యాభ్యాసం వరకు నెలకు రూ. 200 నామమాత్రపు ఫీజుగా చెల్లించాలి. బాలికలు, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీకి చెందిన వారు, వికలాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంది.

## ప్రమాణాలకు పట్టం

# జవహర్ నవోదయ స్కూల్స్

రాష్ట్రంలో ఏర్పాటైన పాఠశాలల్లో చేరిన విద్యార్థులు ఇంగ్లిష్, హిందీ, తెలుగు భాషలలో తగిన ప్రావీణ్యం పొందేలా చూస్తారు. నవోదయ విద్యార్థులను స్కౌట్స్, గైడింగ్, ఎన్‌సిసి కార్యకలాపాలలో నిమగ్నం చేసే దిశగా కూడా ఈ పాఠశాలలు కృషి చేస్తున్నాయి. ఇందుకోసం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఈ కార్యక్రమాల్లో శిక్షణనందించడానికి నవోదయ విద్యాలయాకు గుర్తింపునిచ్చాయి. క్రీడల విషయానికి వస్తే విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యాన్ని గుర్తించేందుకు ఏటా నవోదయ సమితి 'నేషనల్ స్పోర్ట్స్ మీట్'ను ఏర్పాటు చేస్తున్నది. దీని ద్వారా అర్హత గల క్రీడాకారులను ఎంపికచేసి వారికి తగిన రీతిలో శిక్షణనందిస్తున్నది. గిరిజన ప్రాంతాలలో ఉన్న పాఠశాలల్లో అక్కడి విద్యా ర్థులను విలు విద్య (ఆర్చరీ), జూడో, జిమ్నాస్టిక్స్ వంటి అంశాల్లో ప్రోత్సహించడం గమనార్హం.

### సిబిఎస్ఇలో బోధన

నవోదయ విద్యాలయాలలో ప్రధానంగా ప్రవేశం 6వ తరగతితో ప్రారంభమవుతుంది. ఇందుకోసం అభ్యర్థులు 5వ తరగతి చదువుతున్న సమయంలోనే ప్రవేశ పరీక్ష రాయాలి. ఒకసారి ప్రవేశం పొందిన అనంతరం విద్యార్థులకు 6 నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా చదువుకోవచ్చు. ఖాళీగా ఉన్న 9వ తరగతి సీట్లలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా 11వ తరగతిలో ప్రవేశం 10వ తరగతి బోర్డు పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఉంటుంది. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నవోదయ విద్యాలయాల్లో సిబిఎస్ఇ కరికులం కొనసా

### నోటిఫికేషన్

6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ప్రవేశ పరీక్ష 2010, ఫిబ్రవరి 7న ఉంటుంది.

ఎంట్రెన్స్ నిడివి రెండు గంటలు. ఆబ్జెక్టివ్ విధానంలో మూడు విభాగాలు ఉంటాయి. వంద మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. 60 మేధాశక్తిని పరీక్షించే ప్రశ్నలు, 20 గణితం, 20 భాషపై ప్రశ్నలు ఉంటాయి. 5వ తరగతి చదివిన భాషా మాధ్యమంలోనే ప్రవేశ పరీక్ష రాయవచ్చు.

### దరఖాస్తు విధానం

జిల్లా, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయలు, ప్రభుత్వ, సర్కారు గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి, దరఖాస్తులను ఉచితంగా పొందవచ్చు. నవోదయ విద్యాలయ కార్యాలయాల నుంచి కూడా తీసుకోవచ్చు. www.navodaya.gov.in నుంచి కూడా అప్లికేషన్ ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను సెప్టెంబరు 15 లోగా పంపుకోవాలి.



# విదేశాల్లో చదువు

విదేశాల్లో చదువుకోవాలనేది చాలా మంది భారతీయ విద్యార్థుల కల. కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ఇదే మార్గమని కొందరు భావిస్తారు. అసోచామ్ (అసోసియేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా) -2008 నివేదిక ప్రకారం ఏటా 4.5 లక్షల మంది విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. చాలా కాలంగా అమెరికా, ఇంగ్లాండ్ విద్యార్థుల హాట్ డెస్టినేషన్లుగా ఉన్నాయి. ఇటీవలి జాతివ్యతిరేక దాడులను పక్కన పెడితే ఆస్ట్రేలియా కూడా ఈ దేశాలతో పోటీ పడుతోంది. ఆస్ట్రేలియాలో 95వేల మంది భారతీయ విద్యార్థులు ఉండగా అమెరికాలో 90 వేల మంది, యుకెలో 45 వేల మంది ఉన్నారు. ఆస్ట్రేలియాలో ఇన్ని దాడులు జరుగుతున్నా గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఎనిమిది శాతం మంది విద్యార్థులు అధికంగా అక్కడి వెళుతున్నారు.

సాధారణంగా విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రెండు సీజన్లు ఉంటాయి. జనవరి/ఫిబ్రవరి ఒక సీజన్ అయితే. ఆగస్టు/ సెప్టెంబర్ మరో సీజన్ ఉంటుంది.

### ఇదే సరైన సమయం

వచ్చే విద్యా సంవత్సరం విదేశాల్లో చదువుకోవాలనుకుంటున్నవారు దరఖాస్తు చేసుకోవడానికి ఇదే సరైన సమయం. అమెరికాకు చదువుకోసం వెళ్లాలనుకుంటే ఆరు నెలల ముందే దరఖాస్తు చేసుకోవడం ఉత్తమం. 'ఫాల్స్' సెమిస్టరు సెప్టెంబరులో ఉంటుంది. దీనికి దరఖాస్తులన్నీ ఫిబ్రవరిలోపు పూర్తికావాలి. అమెరికాలోని కాలేజీలు, కోర్సులు మొదలైన వాటిని షార్ట్ లిస్ట్ చేసుకునే పని ఇప్పుడే మొదలు పెట్టాలి. యుకెకు సంబంధించిన వరకు జనవరి సరైన సమయం. అక్కడి పాపులర్ కోర్సులకు దరఖాస్తులు అన్నీ జనవరిలోనే ప్రారంభం అవుతాయి.

### యూనివర్సిటీల ఎంపిక

మొదట కోర్సును ఎంపిక చేసుకుని, దానికి ఏ యూనివర్సిటీ సరైందో వెతకాలి. పరిశోధనల వైపు వెళ్లాలంటే అమెరికా వెళ్లడం ఉత్తమం. అదే ఎకనామిక్స్ వంటి ప్యూర్ సబ్జెక్టులవైపు వెళ్లాలనుకుంటే యుకె మంచిది. హోటల్ మేనేజ్‌మెంట్ వంటివి స్విట్జర్లాండ్‌లో బాగుంటాయి. అకౌంటింగ్, ఫైనాన్స్, ఇంజనీరింగ్, ఒకేషనల్ వంటి అప్లయిడ్ కోర్సులకు ఆస్ట్రేలియా మంచిది. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజీలాండ్, మొదలైన దేశాలకు ఇమ్మిగ్రేషన్ సులువుగా లభిస్తుంది.

### ఎంబసీ చెక్

ఏ దేశంలో చదవాలో నిర్ణయించుకున్న తరవాత ఆయా దేశాల ఎంబసీలు, యూనివర్సిటీలు నిర్వహించే ఎడ్యుకేషన్ ఫెయిర్‌లకు హాజరైతే మంచిది. సంబంధిత కాలేజీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుంది. విదేశాల్లో చాలా కాలేజీలు ముఖ్యంగా యుకెలోని కాలేజీలు భారతీయ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాయి. అయితే ఆయా కాలేజీల వెబ్‌సైట్ చూస్తే తప్ప ఆ వివరాలు లభించడం కష్టం. యుకె లేదా యుఎస్‌లోని యూనివర్సిటీలో చదవాలని నిర్ణయించుకుంటే బ్రిటిష్ కౌన్సిల్ (మన రాష్ట్రంలో బ్రిటీష్ లైబ్రరీ) లేదా యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌లను కానీ సంప్రతించవచ్చు.

### గ్లోబల్ ర్యాంకింగ్

ఏదైనా యూనివర్సిటీని ఎంచుకోవాలంటే ఆయా కోర్సుల్లో ఆ యూనివర్సిటీకి ఉన్న పేరు, స్కాలర్‌షిప్ ఆప్షన్స్, యూనివర్సిటీలో విద్యార్థుల సంఖ్య మొదలైనవి చూడాలి. కొన్నిదేశాల్లో వాటి రాయబార కార్యాలయాలు, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లు ర్యాంకులు కూడా విడుదల చేస్తాయి. ఉదాహరణకు కాలేజీలు, యూనివర్సిటీలను క్లాసిఫై చేయడానికి సింగపూర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కొన్ని విద్యా సంస్థలకు సింగపూర్ క్వాలిటీ క్లాస్ సర్టిఫికేషన్‌ను ప్రదానం చేస్తుంది. యుకెలో బ్రిటీష్ అక్రిడేషన్ కౌన్సిల్, అమెరికాలో ప్రాంతీయ సర్టిఫికేషన్స్ ఉన్నాయి. లండన్‌లోని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సప్లిమెంట్ ప్రతీ సంవత్సరం ప్రపంచంలోని వివిధ యూనివర్సిటీల ర్యాంకింగ్‌లను ప్రచురిస్తుంది. చాలా సంస్థలు ఇలాంటివి ప్రచురించినప్పటికీ టైమ్స్ ప్రచురణను ప్రామాణికంగా భావిస్తారు. మరో సూచన ఏమంటే విద్యార్థులు కేవలం ఒక్క యూని వర్సిటీకి మాత్రమే దరఖాస్తు చేసి ఊరుకోవద్దు. అలాగే ఇంగ్లాండ్‌లో స్కాలర్‌షిప్‌ల కోసం www. britishcouncil.org.in/scholarships వెబ్‌సైట్ చూడవచ్చు.

### పని- చదువు

బ్రిటన్‌లో అందరిని ఎక్కువగా ఆకర్షించేది ఒక సంవత్సర మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్. కొన్ని యూనివర్సిటీల్లో దీని తరవాత రెండు సంవత్సరాల వర్క్ వీసా ఇస్తారు. ఏ దేశానికి చదువుకోసం వెళ్లినా, కనీసం టాప్ 200 లిస్ట్‌లో ఆ కాలేజీ ఉందా లేదా అని పరిశీలించుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు కాలేజీలో చేరవద్దు. ఫీజు తక్కువ అని మొదట అక్కడికి వెళితే చాలా సందర్భాల్లో మునగక తప్పదు. విద్యార్థులు మొదట కాలేజీ వెబ్‌సైట్ చూడాలి. ఆ కాలేజీలు అందించే కోర్సులు ఏమిటి, అక్కడ విదేశీ విద్యార్థులు ఎంత మంది చదువుకుంటున్నారో చూడాలి. అది మంచి కోర్సు అయినప్పటికీ అక్కడ విదేశీ విద్యార్థులు కనక లేనట్లయితే ఆ కాలేజీలో అంత స్నేహపూర్వక వాతావరణం ఉన్నట్లు కాదు. ఈ జాగ్రత్త తీసుకోవడం తప్పనిసరి.

**2008లో టాప్ యూనివర్సిటీలు**
**(క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్)**

1. హార్వర్డ్ యూనివర్సిటీ, అమెరికా
2. యేల్ యూనివర్సిటీ, అమెరికా
3. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి, యుకె
4. యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్, యుకె
5. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
6. ఇంపీరియల్ కాలేజ్ లండన్, యుకె
7. యూనివర్సిటీ కాలేజ్ లండన్, యుకె
8. యూనివర్సిటీ ఆఫ్ చికాగో, యుఎస్
9. మెసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యుఎస్
10. కొలంబియా యూనివర్సిటీ, యూఎస్
11. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, యుఎస్
12. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, యుఎస్
13. డ్యూక్ యూనివర్సిటీ, యుఎస్
13. జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ, యుఎస్
15. కార్నెల్ యూనివర్సిటీ, యుఎస్
16. ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియా
17. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, యుఎస్
18. యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్, యుఎస్
19. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, జపాన్
20. మెక్‌గిల్ యూనివర్సిటీ, కెనడా
21. కార్నెగిమెలన్ యూనివర్సిటీ, యుఎస్
22. కింగ్స్ కాలేజ్, యుకె
23. యూనివర్సిటీ ఆఫ్ ఎడింబరో, యుకె
24. ఇటిహెచ్ జ్యూరిచ్, స్విట్జర్లాండ్
25. క్యోటో యూనివర్సిటీ, జపాన్
26. యూనివర్సిటీ ఆఫ్ హాంగ్‌కాంగ్, హాంగ్‌కాంగ్
27. బ్రౌన్ యూనివర్సిటీ, యుఎస్
28. ఎకోలే నార్మేల్ సుపీరియర్ పారిస్, ఫ్రాన్స్
29. యూనివర్సిటీ ఆఫ్ మాచెస్టర్, యుకె
30. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్, యుఎస్
30. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, సింగపూర్

**టాప్ 500** యూనివర్సిటీల కోసం www.topuniversities.com వెబ్‌సైట్ చూడవచ్చు.

### సరైన సమాచారం

ఒక కాలేజీ లేదా కోర్సు గురించి సమాచారం కావాలంటే ఇంటర్నెట్‌లో చాలా దొరుకుతుంది. వాటిని ఫిల్టర్ చేయడమే సమస్య. ఇలాంటి వాటి కోసం గుర్తింపు పొందిన కన్సల్టెన్సీలను సంప్రతించవచ్చు. బ్రిటీష్ కౌన్సిల్ కొన్ని గుర్తింపు పొందిన సంస్థల లిస్ట్ రూపొందించింది. వారిని సంప్రతిస్తే ఆ దేశానికి సంబంధించిన వివరాలు తెలుస్తాయి. యుఎస్ సంస్థల కోసం అమెరికన్ ఇంటర్నేషనల్ రిక్రూట్‌మెంట్ కౌన్సిల్ వెబ్‌సైట్ చూడవచ్చు. అదే ఆస్ట్రేలియా అయితే www.aaeri.org వెబ్‌సైట్ చూడవచ్చు.

### వీసా

కోర్సు, కాలేజీలు ఎంపిక చేసుకున్న తరవాత వీసాకు దరఖాస్తు చేయడమే. యుకె కోసం అయితే బ్రిటీష్ డిప్యూటీ హైకమిషన్ పార్ట్‌నర్ ఏజెన్సీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మంచిది. బ్రిటీష్ కౌన్సిల్ వెబ్‌సైట్ ద్వారా ఏజెన్సీల క్రెడెన్షియల్స్ పరిశీలించుకోవచ్చు. ఆస్ట్రేలియా కోసం మన దేశంలోని ఈ-వీసా ఏజెంట్స్‌ను(www.immi.gov.au) సంప్రతించవచ్చు. యుకె వీసాలు సులువుగానే లభిస్తాయి. ఆస్ట్రేలియా వీసాలు కూడా కొంచెం సమయం తీసుకున్నప్పటికీ సులువుగానే లభిస్తాయి. దీనికి రెండు మూడు నెలలు పడుతుంది. యుఎస్ వీసాకు అతి తక్కువ సమయం పడుతుంది. అయితే పూర్తిగా అపనమ్మకమైంది. ఇంటర్వ్యూ సమయంలో వీసా అధికారి విద్యార్థిని వేసే అంచనాను బట్టి ఉంటుంది.

### కల్చరల్ చేంజెస్

విదేశాలకు వెళ్లి డిగ్రీ సంపాదించుకోవడం అంటే కేవలం కాలేజీలో అడ్మిషన్ తెచ్చుకోవడం మాత్రమే కాదు. కొత్త వాతావరణానికి అలవాటు పడడం. కరెన్సీ మార్పులు దగ్గర నుంచి అన్నింటిని నేర్చుకోవాలి. కొన్ని సందర్భాల్లో పతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో సీటు సంపాదించడం కన్నా తమ బడ్జెట్‌లో అకామిడేషన్ దొరకడం కష్టం. హాస్టల్స్‌లో ఉండాలంటే ఖర్చు చాలా ఎక్కువ. అపార్ట్‌మెంట్ షేర్ చేసుకోవాలంటే తెలిసిన, వేవ్‌లెన్త్ ఉన్న వ్యక్తులు దొరకాలి. వీటితోపాటు కల్చరల్‌గా వచ్చే ఇబ్బందులు, భద్రత కూడా చాలా ముఖ్యమే. ఇటీవలి కాలంలో ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థులపై జరుగుతున్న దాడులు ఆందోళన కరం. అందుకే భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. అంతే కాదు స్థానిక అలవాట్లు, ఆహార్యాన్ని కూడా వంటపట్టించుకోవడం అవసరం. ఇందుకోసం స్థానిక, విదేశీ విద్యార్థులను తరచూ కలుస్తే మంచిది.

**- జి.అనీష్ కుమార్**

## చదువుపై చికాకు

**ప్ర: మా పాఠశాలలో ప్రతి మంగళవారం దిక్సూచి చదువుతున్నాం. మాకు బాగా చదివి పైకి రావాలని ఉంది. కానీ ఆ పుస్తకాలు చూసినా, పాఠాలు వింటున్నా, ఇంట్లో తల్లిదండ్రుల హెచ్చరిస్తున్నా చదువుపై చికాకు కలుగుతుంది. మాలాంటి వాళ్లు ఎలా చదవాలి, పైకి ఎలా వెళ్లాలి?**

**- సి.వి.ఎస్.సుబ్బారెడ్డి, రామచంద్రపురం**

ఈ ప్రపంచంలో అందరూ పైకి వెళ్తారు - కానీ పైకి ఎదగడానికి మాత్రం కొంత కృషి చేయాలి. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు, మేధావి, ఉత్తమ ఉపాధ్యాయుడైన బాలగంగాధర తిలక్ చదువు రావాలంటే నాలుగు 'A'లు గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. 1. Attitude (వైఖరి) 2. Accademic skills (విద్యా నైపుణ్యాలు) 3. Awarness (చదువు విలువ గుర్తించాలి) 4. Accomplishment (చదివిన దానికి సార్థకత).

నీవు, నీ స్నేహితులు ముందుగా అలవర్చుకోవాల్సినది చదువుపై ఇష్టం. ఇంట్లోవారి కోసం కష్టపడి చదవద్దు, ఇష్టపడి చదవండి. మీరు చదివింది జీవితంలో మీ గమ్యాన్ని నిర్ణయిస్తుంది. బ్రిటీష్ దొరల సంకెళ్ల నుంచి భారతదేశం విడుదల కావాలనే బలమైన కోరిక, ఆ రోజుల్లో తిలక్‌ను బాగా ఇష్టపడి చదివేలా చేసింది. అందుకే బాగా చదువుకుని, ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడటం నేర్చుకొన్నారు. బి.ఎ. ఆ తరవాత ఎల్ఎల్‌బి చదివారు. మన భారతీయ పిల్లల కోసం పాఠశాల పెట్టారు. మరాఠా, కేసరి అనే పత్రికల్లో బ్రిటీష్ వారి అన్యాయాలను కళ్లకు కట్టినట్లుగా రాశారు. తద్వారా బ్రిటీష్ దొరలు తప్పుదిద్దుకొనేలా చేశారు.

మరి మీలాంటి వారంతా అలా కావాలి. నాడు మనకు కావాల్సింది స్వాతంత్ర్యం ఒక్కటే. ఇప్పుడు ఎటు చూసినా సమస్యలే. హింస పెరిగింది. ఆడవారికి రక్షణ లేదు. ధనికులు మరీ ధనికులవుతున్నారు, పేదలు మరీ పేదలవుతున్నారు. నేటికి కొన్ని గ్రామాల్లో తాగునీరు లేదు, పంటలు చీడ పురుగులతో నాశనం అవుతోంది. వాతావరణంలో కాలుష్యం పెరిగింది. పిల్లలూ! ఆలోచించండి. ఇటువంటి పరిస్థితిలో మీరు చదువు మానేసి, నిరుద్యోగులుగా మారి మన దేశాన్ని మళ్లీ పరాయి దేశం వారి చేతిలో పెడతారా? కాబట్టి కష్టపడి చదవద్దు, దేశం కోసం ఇష్టపడి చదవండి. గుడ్‌లక్.

## చదువు ఎలా సాగుతుంది

**ప్ర: మా బడి పక్కనే ఒక గుడి ఉంది. వారూ రోజూ మైకులో గట్టిగా ప్రార్థనలు చేస్తారు. ఆ సమయంలో టీచరు చెప్పేది వినపడదు. ఆయన మౌనంగా తలపట్టుకొని కూర్చుంటారు. ఇలా అయితే మా చదువు ఎలా సాగుతుంది. భక్తి ముఖ్యమే కానీ మా చదువు సంగతి ఎలా?**




**- జిల్లా నరేష్, ఆకివీడు**

భక్తి తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటివి ఉండటం మంచిదే. కానీ, బడి పక్కనే ఉండటం వలన కొంత ఇబ్బంది ఉంటుంది. అందుకే మీ విద్యార్థులు కొందరు కలసి వారిని కలవండి, రిక్వెస్ట్ చేయండి, లేదా వాల్యూం తగ్గించమని అడగండి. వారు తప్పక చేస్తారు. హైదరాబాద్‌లో ఒక పాఠశాల విద్యార్థులు ఇదే పని చేసినప్పుడు వారు ఎంతో దయతో అంగీకరించి, ప్రార్థన పిలుపు బదులుగా ఒక సైరన్ తక్కువ స్థాయిలో పెట్టారు. ఈవిధంగా సమస్యని పరిష్కరించుకోవాలి తప్ప, టీచరు తలపట్టుకొని కూర్చుంటే విద్యార్థులకు వారిపట్ల అసహనం, ద్వేషం పెరుగుతాయి. మీతో పాటు టీచర్‌ని కూడా తీసుకువెళ్లండి.

## కలెక్టర్ ఎప్పటికి అవుతాను?

**ప్ర: నేను డిగ్రీ పాసయ్యాను. కాంపిటేటివ్ పరీక్షలు రాస్తూనే ఉన్నాను. ఈసారి ఎలాగైనా గ్రూప్స్ లేదా సివిల్స్ సాధించాలనుకుంటున్నాను. కానీ రోజంతా చదివినా, తృప్తి కలిగే విషయమేమీ బుర్రలోకి వెళ్లడం లేదు. ఎంతసేపు వేరే ఆలోచనలు, సినిమాలు, హీరోయిన్లు, రాజకీయాలు, క్రికెట్ లాంటివి బుర్రలో తిరుగుతుంటాయి. ఇలా ఉంటే నేను కలెక్టర్ ఎప్పటికి అవుతాను?**

**- లక్ష్మణరావు లక్కిరాజు, వేములవాడ**

తప్పకుండా త్వరలోనే అవుతారు. కలెక్టర్ కావాలంటే చదవాలనే కమిట్‌మెంట్, చదవగలననే కన్విక్షన్ ఉండాలి. మీరు రోజంతా చదువుతున్నారని అంటున్నారు. అది పూర్తిగా నిజం కాదనే సత్యాన్ని నమ్మండి. మీరు ఒక సిట్టింగ్‌లో రెండు గంటలు కూర్చున్నారనుకోండి. ఆ రెండు గంటల్లో ఏం చేశారో ఒక కాగితంపై రాయండి. అలా రాయడం వల్ల మీ సంగతి మీకు తెలుస్తుంది. ఈమధ్య ఒక అబ్బాయిని కౌన్సిలింగ్‌లో ఈ పని చేయమన్నాను. పక్క గదిలో నేను ఉన్నాను. అతను ఇచ్చిన వివరాలు-

- ఒక చాప్టరు సగం చదవడానికి 20 నిమిషాలు
- చిరంజీవి ముఖ్యమంత్రి అయితే ఎలా ఉంటుంది? 30 నిమిషాలు
- తెలంగాణ వస్తే ఎలా ఉంటుంది? 20 నిమిషాలు
- కలెక్టర్ అయితే హోదా ఎలా ఉంటుంది? 15 నిమిషాలు
- మధ్యలో ఫ్రెండ్‌తో ఫోన్‌లో పరీక్ష గురించి మాటలు 15 నిమిషాలు
- చదివిన నోట్స్ రాసుకోవడం 20 నిమిషాలు
- మొత్తం 120 నిమిషాలు

రెండు గంటలు అయిపోయింది. ఈ రెండు గంటల్లో ఆలోచించినవేవీ అవలేదు. ఆ సమయం అంతా వృథాయే కదా. కాబట్టి ఆలోచించండి, చదువు కోసం కూర్చుంటే వేరే ఆలోచనలు వాయిదా వేయండి. మనందరికీ వాయిదాలు వేయడం వెన్నతో పెట్టిన విద్యే కదా! చదువుతుండగా పనికి మాలిన ఆలోచన వస్తే కుడిచేతి పిడికిలి గట్టిగా బిగించి, దీర్ఘమైన శ్వాస తీసుకొని 'నేనెంతో కాన్ఫిడెంట్‌గా ఉన్నాను, నేను అనుకున్నది చేయగలను' అనుకుంటూ శ్వాస వదలండి. ఆ శ్వాసతోపాటు బద్ధకం కూడా బయటకు పోతుంది.



డాక్టర్ బి.వి.పట్టాభిరామ్
M.A., Ph.D
www.pattabhiram.com

## క్రాస్‌రోడ్స్

చిరునామా: **క్రాస్‌రోడ్స్**, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్‌నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

## ఎడ్యుకేషన్ లోన్స్

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఎడ్యుకేషన్స్ మంజూరు చెస్తున్న ప్రధాన బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ముఖ్యమైనది. ఉపాధి అవకాశాలున్న ఏ కోర్సు అభ్యసించే వారైనా ఈ ఎస్‌బిఐ నుంచి ఎడ్యుకేషన్ లోన్ తీసుకోవడానికి అర్హులే. ఇలా బ్యాంకు రుణ సదుపాయం అందుబాటులోకి తెచ్చే కోర్సుల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు, యుజిసి, ఎఐసిటిఇ వంటి సంస్థలు ఆమోదించిన కోర్సులన్నీ ఉన్నాయి. ఎడ్యుకేషన్ లోన్‌కు ఎస్‌బిఐ ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయడంలేదు. విదేశీ విద్యాభ్యాసానికి దరఖాస్తు చేసుకునే వారు 5000 రూపాయలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మొత్తాన్ని మార్జిన్ మనీకి సద్దుబాటు చేస్తారు.

### లోన్ కవరేజ్

- కళాశాల ఫీజులు, హాస్టల్ ఫీజులు
- పరీక్ష ఫీజులు, లైబ్రరీ, లేబరేటరీ ఫీజులు
- పుస్తకాలు, పరికరాలు, యూనిఫారం కొనుగోలు ఖర్చులు
- కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్, రిఫండబుల్ డిపాజిట్లు
- విదేశాలకు విద్యాభ్యాసానికి వెళ్ళే వారికి ప్రయాణ ఖర్చులు
- విద్యాభ్యాసం కోసం కంప్యూటర్ లేదా లాప్‌టాప్ వంటివి సమకూర్చుకోవాల్సివస్తే వాటి కొనుగోలుకు అయ్యే ఖర్చులు
- ద్విచక్ర వాహనం కొనుగోలుకు గరిష్ఠంగా 50 వేల రూపాయలు.

ఇవి కాకుండా విద్యాభ్యాసంలో భాగంగా స్టడీ టూర్‌లు, ప్రాజెక్ట్ వర్క్ వంటి వాటికి అయ్యే వ్యయాలకు కూడా ఎస్‌బిఐ ఎడ్యుకేషన్ లోన కవరెజ ఇస్తుంది.

### రుణం పరిమితి

- దేశంలో విద్యాభ్యాసానికి గరిష్ఠ మొత్తంలో 10 లక్షలు
- విదేశీ విద్యాభ్యాసానికి గరిష్ఠ మొత్తంలో 20 లక్షలు

### రీపేమెంట్ కాలపరిమితి

ఎడ్యుకేషన్ లోన్ తీసుకున్న వ్యక్తి విద్యాభ్యాసం పూర్తయిన తరవాత ఏడాది లేదా ఉద్యోగంలో చేరిన అనంతరం ఆరు మాసాలు ఏది ముందైతే అప్పటి నుంచి రీపేమెంట్ మొదలవుతుంది. రీపేమెంట్ కాలపరిమితి 5 నుంచి 7 సంవత్సరాల మధ్య ఉంటుంది.

### సెక్యూరిటీ

రూ.4లక్షల లోపు రుణాలకు ఎలాంటి సెక్యూరిటీ అవసరం లేదు. 4 నుంచి 7.5 లక్షల లోపు రుణానికి థర్డ్ పార్టీ కొల్లేటరల్ సెక్యూరిటీ చూపించాల్సిరావచ్చు. అయితే రుణం తీసుకునే వ్యక్తి నికరవిలువ విషయంలో బ్యాంకుకు నమ్మకం కలిగితే థర్డ్ పార్టీ కొల్లేటరల్ నుంచి కూడా మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. 7.5 లక్షల రూపాయలు పైబడిన రుణానికి థర్డ్ పార్టీ కొల్లేటరల్ సెక్యూరిటీ ఇవ్వడంతో పాటు విద్యార్థి విద్యాభ్యాసం ముగిసిన అనంతరం పొందే ఆదాయం నుంచి రుణం మినహాయించుకునేందుకు బ్యాంకుకు అధికారం ఇస్తూ అసైన్‌మెంట్ కాంట్రాక్టు ఇవ్వా ల్సి ఉంటుంది. ఎడ్యుకేషన్ రుణాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, వివాహం అయిన వారై తే భార్య లేదా భర్త, తల్లిదండ్రులు లేదా అత్తమామలు కూడా గ్యారంటీగా నిలవవచ్చు.

### మార్జిన్ మనీ

నాలుగు లక్షల లోపు రుణాలకు మార్జిన్ మనీ అవసరం లేదు. 4 లక్షలు పైబడిన రుణాలకు ఇండియాలో విద్యాభ్యాసానికైతే తీసుకునే రుణంలో 5 శాతం, విదేశీ విద్యకైతే 15 శాతం మార్జిన్ మనీ చెల్లించాల్సి వస్తుంది.

### ఏయే పత్రాలు అవసరం

- ఎడ్యుకేషన్ లోన్‌కు చేసిన దరఖాస్తు
- అర్హత పరీక్షకు సంబంధించిన మార్కుల జాబితా
- సీటు వచ్చినట్టు ధ్రువీకరించే పత్రం
- రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోగ్రాఫ్‌లు
- ఆరు మాసాల బ్యాంకు స్టేట్‌మెంట్
- దరఖాస్తు చేసుకోవడానికి ముందు రెండేళ్ళకు సంబంధించిన ఆదాయపు పన్ను అసెస్‌మెంట్ ఆర్డర్
- సహ దరఖాస్తుదారుని ఆస్తులు, అప్పులకు సంబంధించిన సంక్షిప్త స్టేట్‌మెంట్
- ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఉద్యోగులైతే శాలరీ స్లిప్ లేదా ఫారం 16)

### వడ్డీరేటు

2009 జూన్ 29 నాటికి అమలులో ఉన్న ప్రకారం వడ్డీరేట్లు ఇలా ఉన్నాయి. ఎస్‌బిఏఆర్ 11.75 శాతం ఉంది.

- 4 లక్షల లోపు రుణాలకు ఎస్‌బిఏఆర్ కన్నా 0.5 శాతం తక్కువగా 11.25 శాతం.
- 4 లక్షల నుంచి 7.5 లక్షల వరకు ఎస్‌బిఏఆర్ కన్నా ఒక శాతం అధికంగా 12.75 శాతం.
- 7.5 శాతం పైబడిన రుణాలకు ఎస్‌బిఏఆర్‌తో సమానంగా 11.75 శాతం

2009 మే ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ఎస్‌బిఐ ఎడ్యుకేషన్ లోన్స్‌కు స్పెషల్ ఆఫర్ అమలు పరుస్తోంది. ఈ స్పెషల్ ఆఫర్ కింద రుణం తీసుకున్న వారికి 4 లక్షల లోపు రుణానికి 11 శాతం, 4 నుంచి 7.5 లక్షల రుణానికి 10.75 శాతం, 7.5 లక్షలు పైబడిన రుణానికి 10.5 శాతం వడ్డీ రేటు వసూలు చేస్తున్నారు.

**- దామరాజు**